
# దీపం పురుగు

ఎలికట్టె శంకర్‌రావు



రొండుబారల పొద్దెక్కింది. ఎండ దంచుతుంది. ముసలోల్లు, పడుసోల్లు, ఆడోల్లు... యాబై అరవై మందాసర ఊరిజెనం వాకిట్ల తచ్చాడుతుండ్రు. కొంతమంది గడిమెట్ల మీద కూసుండ్రు. ఇంకొంత మంది దర్వాజను పట్టుకొని వేలాడుకుంట బంకుల్లకు సూస్తుండ్రు.

రొండు చెక్క బెంచీల మీద కులపెద్దలు కూసొని దీర్ఘాలోచన చేస్తుండ్రు. మధ్యమధ్యలో ఎవరో 'ఇట్లయితే ఎట్లుంటది దొరా? సూడ్రి' అంటుండ్రు.

ఎదురుంగ బల్లెపీట మీద పాండురంగారావు దొర కూసుండు. బనీను, తెల్ల లుంగి.. సైకలమూకం యేసుకుండు. గోడకు చేరగిలబడి కంతలు నొక్కుకుంటుండు. గుదిమట్టమైన రూపం. సన్నని మీసకట్టు, ఆలోచనలు.. నిద్ర లేకపోవడం.. మొకం కొద్దిగ గుంజినట్లుంది. కింది కనురెప్పల మీద ఎర్రగ ఉబ్బిన చర్మం.

'మా ఎర్రగొల్లోల్లయ్ తొంబయ్ మూడిండ్లున్నయ్. అదేదో మాదాంట్లె ఆలోచిస్తెనే బావుంటది దొరా' కర్రబోయిన సోములు పెదవులు సప్పరించుకుంట చెప్పిండు. దొర నోరు తెరవక ముందే 'యెహ నీ యెక్క మా పూజగొల్లోల్లయ్ మాత్రం తక్కువున్నయా? డెబ్బయ్ ఇండ్లు లేవా?' తవిటి బుచ్చయ్య తల పాగా తీసుకుంట దిగ్గున లేసిండు ముప్పయ్ యిండ్లే అని ఎవలన్న అంటే అవకాశం యాడబోతదోనని.

'వోరారి! దాంట్లే ఎర్రగొల్ల పూజగొల్లనుకుంట తన్నుకోకర్రా. మా మంగలోల్లయి అయిదిండ్లే. మేవేఁమి పోటికి రాముగని' చెయ్యి అటిటు ఆడించుకుంట కాగడ బక్కులు కసిరిచ్చిండు.

పాండురంగారావు దొర యినుకుంట అందరి మొకాలు గమనిస్తుండు. బయిట వో దమ్ము సుట్టతాగి, తుప్ప

తుప్ప ఊసుకుంట దర్వాజకాడికొచ్చి తుండుగుడ్డతో మూతి తూడ్సుకుండు బోడ జగ్గయ్య.

'ఏ కులానియి ఎన్నిండ్లున్నయ్ అని కాదురా దమ్ముండాలె. వొట్టి పిల్లల పరాశికం కాదు. యాబై యిండ్లున్నా మా గౌండ్లోల్ల దాంట్లె అంత పతార ఉన్నోల్లుండ్రు. ఇది ఆలోచించరి దొరా' అన్నడు. బోడ జగ్గయ్య యిద్దరు కొడుకులు మూడేండ్లసంది సూరత్‌ల గీత పనికి పోతుండ్రు. అంతో యింతో యెనకేసుకుండ్రు.

దొర ఏ నిర్ణయానికీ రాలేకపోతుండు. 'ఈ సర్కారోనితోని పెద్ద సావు. యెప్పుడే నిర్ణయం తీసుకుంటడో తెల్వదు. ఊకె సర్పంచి యెలక్షన్‌లు పెడితే .. బలమున్నోడు గెలుసు. తను గెలవలే నాలుగు దమ్ములు. ఇప్పుడు వో నీయమ్మ జెనాలను ఉద్ధరించాలని రిజర్వేషన్లు పెట్టె. అదీ ఆడి మనిషికి. ఏ కులం నుంచి పెట్టాలె? ఏ ఆడి మనిషి తట్టుకుంటది? పెద్ద తలనొప్పయి పోయింది. అనుకొని కంతలు నొక్కుకుండు.

దొర ఎటూ మాట్లాడలేక పోయేసరికి 'వోయ్యా! సుట్టుపక్కల మాలమాదిగోల్లకిస్తుండ్రు. మనూల్లె ఎందుకియ్యరు? పైన ఏదన్న గట్టి పైరవి పెట్టి అదేదో మా కొచ్చేటట్లు చెయ్యిరి. ఈల్లు కులాని కోడులేసి జుట్లు పట్టుకుంటుండ్రు. మాలోల్లకో మాదిగోల్లకో గని మాదాంట్లె సదురుకుంటం' మాసిక పిచ్చయ్య లేసి దడదడా మాట్లాడిండు.

'నీయమ్మ మీరంతసొక్కాలని? మీదాంట్లె మాత్తరం తన్నుకుంటలేరా మాలోల్లు, మాదిగోల్లని?' తవిటి బుచ్చయ్య రోశానికిపోయి అన్నడు.

తలావో మాట మాట్లాడుతుంటె వాకిట్ల నాసు పెట్టుకుని కూసున్న మూడిండ్ల కుల పెద్ద డమరుకం పెంటయ్య 'మా బైండ్లోల్ల కియ్యిరి పీడపోతది' అన్నడు గట్టిగ దొరకినబడేటట్లు.

మాకియ్యాలే మాకియ్యాలే అని ఇంకో రొండు మూడు గొంతులు వినిపించినయ్.

దొర ఆలోచన్ల పడ్డడు. 'ఎవర్ని పెట్టాలె? గొల్లోల్లను గౌండ్లోల్లను పెడితే కులం వోట్లున్నయ్. గెలుస్తరుగని డబ్బులున్న ముండాకొడుకులు పాతుకపోతరు. మల్ల రేపు తనకు మేకై కూసుంటరు. ఇంక యెనకబడ్డ కులాలల్ల బంటోల్లుండ్రు. వాల్లొట్టి తొండలు కొట్టే ముండాకొడుకులు. వోని దగ్గర పతార లేదు. మాలమాదిగోల్లు ఎట్లాగూ పనికి రారు. ఇంక అయిదు పదిండ్లున్నయ్. సాకలోల్లు, మంగలోల్లు.. వొడ్లకమ్మరోల్లు... ఈ కులాలల్లనే సూడాలె. కాస్త పైసలుండి బుద్ధిగల్ల యెదవను సూడాలె. మల్లా ఆడి మనిషి ఇంతంత రూపం గల్లదై వుండాలె. ఎవరున్నరట్లా?' దొర సన్నటి మీసాన్ని దువ్వుకుంట ఆలోచించిండు.

అంత సేపు కాలుమీద కాలేసుకొని అటుపక్క చెక్కకుర్సి మీద కూసున్న కోంట కిష్టయ్య 'దొర వారూ అవుతల పార్టోల్లు అప్పుడే నామినేషనేసిండ్రు. రేపు లేదు యెల్లుండే ఆకరి. తమరేదో తొందర కానిస్తే బావుంటది' అని సలహా యిచ్చిండు.

దొర యేందిరో దొర పీకుండేదిరో అని పాటలు పాడీపాడి వోతరం అలిసిపోయింది. దొర కూడా పట్టిచ్చుకోకుంట ఉండే సరికి పాండురంగారావు గారూ అని పిలిసిండ్రు. కాని ఈ నడుమ బతక నేర్సినోల్లు మల్లా 'దొరవారూ' అని నోటినిండుగా పిలుస్తుండ్రు.

పొద్దు నడినెత్తికెక్కుతావుంటె అందరి పేగుల్ల గుర్రు మన్న సప్పుడు వినబడుతుంది.

బెంచి మీది కులపెద్దలు, నిలబడ్డ యువకులు, బయిట ఎదురు చూస్తున్న జనంలో అలసట. తొందరగ తెమిలితే బావుండు నన్న భావం... అసహనం.....

దొర తేరిపారజూసి మెడమీద గోక్కుంట 'తొందరపడి తీసుకునే నిర్ణయాలు కావు. ఆకలిమీదున్నట్లుంది. యింటికి పోండ్రి. ఇంత తినాలోచించరి. పొద్దూకంతల అదేదో ఖాయం చేద్దాం' అని తిమ్మిరి బట్టిన కాల్లను సాపుకుండు.

అంతా లేసి బయిటికొచ్చిండ్రు. వాకిట్ల గుసగుసల నడుమ 'యెటూ తెల్సడేందే దొరా? ఒకటే పిసుకుతడు' వో పడుసు పిలగాడు విసుగ్గా అన్నడు.

'నీకు తెల్వదులేరా. అందుకనే పడుసో పెడుసో

'ఈ సర్కారోనితోని పెద్ద సావు. యెప్పుడే నిర్ణయం తీసుకుంటడో తెల్వదు. ఊకె సర్పంచి యెలక్షన్‌లు పెడితే .. బలమున్నోడు గెలుసు. తను గెలవలే నాలుగు దమ్ములు. ఇప్పుడు వో నీయమ్మ జెనాలను ఉద్ధరించాలని రిజర్వేషన్లు పెట్టె. అదీ ఆడి మనిషికి. ఏ కులం నుంచి పెట్టాలె? ఏ ఆడి మనిషి తట్టుకుంటది? పెద్ద తలనొప్పయి పోయింది.

అంటరు. ఊరి ముచ్చెట. పది తీర్లగ ఆలోచించాలె. మరి దొర మన్సులేముందో? ఆగరాదురి ఇయ్యాల కతం జేద్దామంటుండుగా' డెబ్బయ్ యేండ్ల కమ్మరి రాములు అద్దాలు సరిచేసుకుంట అన్నడు.

అంతసేపు ఉన్న రణగొణధ్వని ఆగిపోయింది. బల్లెపీట మీద దొర, దర్వాజ కాడ గజ్జల కర్రపట్టుకొని నిలబడ్డ మస్కూరు మస్తాన్ మిగిలిండ్రు.

'మస్తాన్ లోపల్నుంచి మంచినీల్లు పట్కరమ్మను' చెయ్యి ఇంట్లెకల్ల సూపిచ్చుకుంట చెప్పిండు. మస్తాన్ కర్రను గోడకానించి, చెప్పులిడ్సిండు. బంకుల దర్వాజ పట్టకొని లోపలికొంగి అటిటు చూసిండు. పనిపిల్ల కనిపించేసరికి 'దొరవారికి నీల్లు తేవేపిల్లా' అని పిల్ల యిచ్చిన నీల్ల చెంబును దొరకిచ్చిండు.

దొర గడగడా ఎత్తి తాగిండు. చెంబును బల్లెపీట మీద పెట్టి మస్తాన్ కల్ల చూసిండు.

మస్తాన్‌కు అర్దమై దొర దగ్గరకు జరిగి నిలబడ్డడు. 'నువ్వు ఉన్న పల్లంగ ... ఆటోలున్నాలె... నల్లగొండకు పోయి... మన వొడ్లోల్ల బ్రహ్మచారి లేడు... అదే కరెంటు మెకానికు.... జేల్‌ఖాన కాడ షాపు.... నేను రమ్మంటున్నని చెప్పి తీస్కొని రా.... ఈడ వున్నట్టు ఉండాలె... యేమంటున్న? కిరాయి తీసుకొని జల్దిపో..' దొర మస్తానుకు చెప్పి లేసిండు.

***

'చారి మెకానిక్'

చిన్నపాటి బోర్డు కనిపిస్తుంది. చెవులు అదిరిపోయేటట్లు సప్పుడు. ఎత్తుపెట్టిన చెక్కబల్లమీద, అడ్డగోలిగ పడివున్న మోటర్ల మీద కూసొని రైతులు మాట్లాడుకుంటుండ్రు. దాదాపు అందరి చేతుల్లా కాలుతున్న చుట్టలు.

బ్రహ్మాచారి రింగ్‌పానాతో హుప్ హుప్ అని మోటరు బోల్టులు టైట్ చేసి కనెక్షన్ ఇచ్చిండు. 'అరే ఆడ కట్కేయిరా' కేకేసిండు లోపల ఉన్న పిలగాన్ని. మోటరు ఆన్ చేసి సంతృప్తిగా తలాడించిండు.

'వో యెంకయ్య కక్కయ్యా! ఇగో నీ మోటరు. అయిపోయింది. రిక్షా తెచ్చుకో' అక్కడ్నే వున్న రైతుకు చెప్పిండు. ఆ రైతు దగ్గరకొచ్చి 'ఇబ్బందేమీ పెట్టదుగా బిడ్డా! రొండు దినాలసంది శెర... ఆడ నిర్రెలిడిసినాలె' అని మోటర్ను అటుయిటూ సూసుకొని 'ఎంత బిడ్డా?' అన్నడు. చారి ' ఇయ్యరాదే' అన్నడు నవ్వుకుంట.

యెంకయ్య 'బిడ్డా యియ్యి వుంచు. ఇయ్యి కూడా అడగకూడనోన్ని అడిగి తెచ్చిన. నీ కష్టమేమి ఉంచుకోను తర్వాత ఇస్తలే' అని చేతులబెట్టిండు. చారి నవ్వుకుంట 'అట్లనే కానీ కక్కయ్యా మీరంతా సల్లగ ఉండటం కంటే కావల్సింది ఏముందే' అని ఇచ్చిన కాడికి తీసుకుండు.

ఇంకో రైతొచ్చి 'వోయ్యా నాదియ్యాల్నే కావాలె. పొద్దూకేసరికి మోటరు బిగిస్తేనే ఏవన్న. లేకుంటే నోట్లె మట్టే' అని తలపట్టుకుండు.

'మావా ఎంతరాత్రైన నిన్ను పంపిస్తనే. నువ్వేం ఫికర్ పెట్టుకోకు. ఆడకూసో' అన్నడు చారి.

ఆ రైతు కూజల నీల్లు వంచుకొని గడగడ రొండు గిలాసులు తాగుతుంటే' ఏందిమావా తిని రాలేదా? హోటల్నించి తెప్పియ్యనా?' అన్నడు.

'వోటల్ల తినే బతుకులా బిడ్డా' అన్నడు రైతు.

'రేయ్ అందరికి చాయ్‌లు చెప్పు' పిలగాన్ని హోటల్‌కల్ల గెదిమిండు. చారి నోరు చేతులు ఊకుంట లేవు. రొండు చేతుల పని చేసుకుంటనే నలుగురికి సమాధానం చెపుతుండు.


'బిడ్డ పగలు మాపనకుంట పనిజేస్తడు. అదును మీద అందిస్తడు. ఉన్నోన్ని లేనోన్ని కనిపెడ్తడు.' రైతులనుకునే మాట. చారి మాత్రం తెల్లని పండ్లు కనపడేటట్లు నవ్వుతడు విని.

దీనంగా.... 'మోటరు కాలిపాయే, ఫైరెండిపాయె' అని మనాది బెట్టుకొని కూసుంటోల్లగ్గూడా 'దిగులు పెట్టుకుంటే వొచ్చిన కష్టం పోతాదే' అని సుద్ది మాటలు చెప్పుతడు. 'నా రూపం చూసి దేవుడు నన్ను మెకానిక్‌ను జేసిండు. ఆయిలంటినా వొంటిమీద కనపడకూడదనుకుండేమో' అని నవ్వించి వాతావరణం తేలిక జేస్తుంటడు.

పిల్లలకు పనిచెప్పుకుంట రైతులను సమాధానపర్చుకుంట అష్టావదానం చేస్తుండు చారి.

మస్కూరు మస్తాన్ చేతుల కర్రను గల్లుగల్లుమని పాడుసుకుంట వొచ్చి గదమకు ఆనించుకొని నిలబడ్డడు.

'మస్తాన్ ఎప్పుడొచ్చినవ్' పనిచేసుకుంటనే వెన




కకు మళ్లి పలకరించిండు చారి.

'ఇప్పుడే సక్కగ నీ కాడికే వొస్తున్న ' అటిటు సూసి అంతమంది రైతుల ముందు చెప్పాల్నా వొద్దా అని తటపటాయించిండు.

'ఏంది సంగతి?' అని అడిగి అప్పుడే వొచ్చిన చాయి పిలగాన్ని ' అరే యిటో చాయ్ యియ్యి' అన్నడు.

మస్తాన్ చాయ్ తాగి 'వో మాట. ఇటు పక్కకొస్తావ్' అని చారిని పిలిసిండు. 'ఏందది' అనుకుంట చారి పక్కకు పోయిండు.

'దొర ఉన్నపలంగా రమ్మన్నడు' అని చెప్పిండు.

'ఎట్లనే? యింత మందిని షాపుల కూసబెట్టి? అసలు రొండు దినాల సంది లో వోల్టేజి, హై వోల్టేజని కరంటోడు ఆడుకుంటుంటే మోటర్లన్ని తగలబడి రైతులు తలకాయలు పట్టుకుంటుండ్రు. సూడు ఎన్ని మోటర్లున్నయో? అసలు ముడ్డి కడుక్కుంటందుకు గూడ తీరిక లేదు.' చారి తన పరిస్థితి చెప్పిండు.

'దొర... ఎందుకు కంటు? రమ్మంటే – వొడ్లోడు నల్లగొండల సంపాయించుకుంట పిర్రలెల్ల బలిసిండు. ఆయినకు చిన్న పెద్ద కనబడతాది అని కారెడ్డమాడ్తడు. యాన్నో ఉచ్చ బోసేకాడ దొరికిచ్చుకొని వొత్తుతడు. అని ఆలోచించుకొని ' ఏంది మస్తాన్ ఏందంత అర్జెంటు?' ఆరా తీసిండు.

'దొర నాకు చెపుతడా యేంది? నువ్వు బలే అడుగుతవ్ చారి?' అన్నడు మస్తాన్.

ఇంగ తప్పదని అక్కడున్న రైతులకు ' ఈడిదాంక పోయొస్తనే' అని చెప్పి పిల్లలకు పనులు పురమాయించి స్కూటరు తీసిండు. ఊరి బైటికెల్లినంక ' ఎవరుండ్రు గడిల?' అడిగిండు.

'పొద్దున వూల్లోల్లంత కూసోని మాట్లాడిండ్రు. అదే సర్పంచ్ ముచ్చట' మస్తాన్ చెప్పిండు.

మరి తననెందుకు పిలిసినట్లు? తన భార్యనైతే పోటీ చేయమనడుగా? అయినా తనకు రాజకీయాల మీద కోరిక లేదు. కుల బలం తక్కువ. ఎంత లేదన్నా యాభై అరవై వేలు దరిద్రానికి ఖర్చు పెట్టాలె. హాయిగా పనిచేసుకొని బతికెటోనికి తనకెందుకు తలకాయనొప్పులు? ఒకవేల అవకాశమే వొస్తే... పుట్టిన పుటుకకు పోటీ చేసి గెలవటం కల్ల. రిజర్వేషన్ కాబట్టి దొర దూరంగుంటడు. అన్ని సార్లు అవకాశం రావొద్దు? వస్తే సూద్దాం. ఒక్కసారి సర్పంచ్ అనిపించుకున్నా దాని కాన్‌దానే వేరే వుంటది గదా! ఒకవేల అదే ఐతే తినేది వొదిలిపెట్టి కోల్లగొట్టపోయినట్లు కాదుగా! చారి ఆలోచనలోంచి తేరుకొనేసరికి గడి ముందల ఆగింది స్కూటర్.

బంకుల్ల కూసొని దొర జీతగాండ్లకేదో పురమాయిస్తుండు. చారి రొండు చేతులెత్తి 'దండమయ్యా' అన్నడు. 'యేం చారీ బావున్నవా? ఈ నడమ బొత్తిగ నల్లపూసవై పోయినవ్?' పలకరించి బెంచి మీద కూసో అన్నట్లుగా చెయ్యి చూపిచ్చిండు.

చారి వినయంగా కూసోని 'ఏం జెయ్యమంటరు దొరా క్షణం తీరిక లేదు దమ్మిడి ఆందని లేదు. ఈ నడమ మోటర్లు వొరుసబెట్టి తగలబడుతున్నయ్. రైతులు మోటర్లేసుకొని వస్తే – ఇంటికొచ్చె సరికి నడిజాము అయితుంది. మల్ల శీకటితోనే లేసుడాయె' సంజాయిషీ ఇచ్చినట్లుగా చెప్పిండు.

జీతగాండ్లు యెల్లిపోయిండ్రు. మస్కూరు దర్వాజ కాడ నిలబడటం చూసి 'మస్తాన్ పొద్దున్నుంచేమన్న తిన్నవా? పోయిరారాదు' అన్నడు.

మస్తాన్ అర్థం చేసుకొని వెల్లిపోయిండు.

దొర సరాయించుకుంట చారి దిక్కు సూసిండు. అసలు సంగతి చెప్పడానికి ఆలోచిస్తున్నట్లుండు. 'తమరు పిలిసిండ్రటా...?' చారి యెనకముందాడుకుంట అడిగిండు.

'ఆఁ యేం లేదయా చారీ! ఈ సర్పంచ్ ఎన్నికలు.. పెద్ద తలకాయనొప్పయ్ పోయిందయా. దీనమ్మ ఊకుందామా ఎవడోవోడు శాతనైనోడు చేసుకుంటడు అనుకుంటే ఊరు ఆగమయ్యేటట్లుంది. చూసుకుంట ఊకోలేను గదా! ఎవన్నో మనోన్ని కాస్త బుద్ధిగల్ల మనిషిని పెట్టాలె గదా! ఎవ్వాల్ని ఉంచుదామా అని పొద్దున సొంతం చర్చ. అంతా మొనగాల్లే. నాకు ఎటు తోస్త లేదయా' దొర ఆలోచించడానికన్నట్లు కండ్లు మూసుకుండు.

దొర యవారాన్ని తన దిక్కే నరుక్కొస్తుండని చారికి అర్థమైంది. ఒకవేల అదే మాటడిగితే తన సమాధానం?

'చారీ బాగా ఆలోచించి వో నిర్ణయానికొచ్చిన్నయా. నీ మీదనే నమ్మకం పెట్టుకున్న. నీ భార్యను పోటీ చేయించుదామనుకుంటున్న.' దొర అసలు ముచ్చట చెప్పిండు.

అసలే వర్క్‌షాపు దగ్గర ఇంజన్ల రిపేరింగ్ కోసం కూసోబెట్టొచ్చినోళ్ళ గురించి మనసు బీకుతుంది. తొందరగబోవాలని చికాకు చికాగ్గుంది. అది సాలక యీయినదొకటి. చారికి ఏం చెప్పాల్నో అర్థం కాక 'మాకెందుకయా ఈ రాజకీయాలు? పనులు చేసుకొని బతికేటోల్లం' అన్నడు చేతులు పిసుక్కుంట.

'అదేందయా? అవకాశం కోసం అందరు అర్రులు చాస్తుంటే నువ్వేంది? నువ్వింకేమీ ఆలోచించకు. రేపు నామినేషన్ యేద్దాం. తయారుగా. భయపడకు గెలుపు మనదే'. దొర మారు మాటకు తావు లేకుంట చెప్పిండు.

'మీ మాట కాదంటాను? కాని మల్లోసారి ఆలోచించరాదురి?' చారి ఎటూ తేల్చుకోలేక అన్నడు.

'అంతా ఆలోచించే నిర్ణయం తీసుకున్నగని తయారుగాపో. యింట్ల నీ భార్యకు వో మాట చెప్పు. మల్లో ఆలోచన చేయకు. పొద్దూకంతల అందర్ని పిలిసి చెపుత. ఏమంటున్న?' దొరతో యింక మాట్లాడాల్సింది ఏమీ లేదని లేసిండు చారి.

సక్కగ యింటికొచ్చిన చారిని చూసి 'ఏంది యాల్లగాని యాల్ల షాపొదిలిపెట్టి వొచ్చినవ్?' చారి భార్య అడిగింది.

చారి నిమ్మలంగా కూసొని 'దొర పిలిపిస్తే వొచ్చిన. ఇటుకూసో వో మాట చెపుత. సర్పంచిగ నిన్ను పోటి చేయమంటుండు. అంతా ఆయిన చూసుకుంట అంటుండు' రొండు మాటల్ల చెప్పిండు చారి.

'పెద్ద పెద్ద ముచ్చట్లు నాకేం తెలుసు' అన్నది చారి భార్య అయోమయంగా. కొద్దిగయినంక 'నువ్వేం ఆలోచించినవ్?' అడిగింది చారిని.

'అవకాశమొచ్చింది. ఎందుకు కాదనాలె అనిపిస్తుంది'.

'మరి షాపు?'

'షాపెడికి పోతది? సర్పంచి పనులేమన్న పొద్దుందాక చేసేయా? అన్ని నడుస్తయ్' చారి నిర్ణయానికొచ్చిండు.

తెల్లారి నామినేషనేసిండ్రు.

'బ్రహ్మాచారి యేఁ మంచి పిలగాడు. నలుగురికి అక్కరొస్తోడు. బానే వుంటది' అన్నరు జనం.

ప్రచారం ఊపందుకుంది. అవుతలి పార్టీ గొల్లాయిన పైసలు గుప్పిస్తుండు. దానికి దీటుగా 'ఏం చారీ' అని దొర అనంగానే చారి చేతులున్న పైసలు అప్పుతెచ్చిన పైసలు అన్ని మంచినీల్లోలిగ పారిచ్చిండు.

నువ్వా నేనా అన్నట్లు నడిసిన ప్రచారం ముగి

సింది. ఎలక్షన్లు అయినయ్. చారి భార్య కొద్ది మెజార్టితో గెలిసింది.

అవుతల పార్టీ గొల్లాయిన 'థూ దీనమ్మ ఊకె ఉన్నా యాభై వేలు మిగులుగదా! బజాట్ల పారేసు కున్నట్లాయె' అని తలపట్టుకుండు.

చారికి యిల్లు జల కడిగినట్లయింది గని గెలిసిన్నన్న సంతృప్తి ఒక్కటే మిగిలింది.

అప్పట్నుంచి చారి సర్పంచి బ్రహ్మచారి అయ్యిండు. భార్య సర్పంచి అన్న ముచ్చట జనం అప్పుడే మర్చిపోయింద్రు.

ఇంక చారికి షాపు, సర్పంచి పనులు ఊపిరాడ కుంట అయ్యింది. మోరి, లైట్లు, రోడ్డు, బడి అని నూటొక్క సమస్యలు ముందల పెట్టింద్రు. చారి అన్ని భుజం మీద యేసుకొని ఆఫీసులసుట్టూ అధికారుల సుట్టూ తిరగటం మొదలు పెట్టిండు. ఎప్పుడో సందు దొరికినపుడు షాపుకాడికొస్తుండు. రైతులను పైసలు కూడా అడగలేకపోతుండు. కొంత మంది అలుసు తీసుకొని' సర్పంచే వొస్త' అని పని చేయించుకొని పోతుంద్రు.

యాడాది దిర్గకముందే షాపు కళ తప్పింది.

'వొడ్లోడు సర్పంచి అయినంక బలిసిండయ్యా. ఆడు షాపొదిలిపెట్టి తిరుగుతుండు. ఆడేడ చేస్తడు పని?' అని ప్రచారం మొదలయ్యింది.

రొండేండ్లకు షాపు మూతబడ్డది.

చారి సర్పంచి పనుల మీద తిరిగీతిరిగి ఊరి పనులు చేస్తుండు.

సర్పంచి ఎలక్షన్లకు తెచ్చిన అప్పు పిల్లలు పెట్టి మోపయ్యింది. ఆఫీసులకు తిరుగుడు, వొచ్చినోల్లకు మర్యాద జేసుడు... అప్పులు పెరిగిపోయినయ్ అప్పులోల్లకు 'ఇగో ఆ కాంట్రాక్టు వొస్తుంది. ఆగురి ఒక్క దెబ్బల యిచ్చేస్త' అని చెపుతుండు సర్పంచి చారి.

అట్లా అట్లా అయిదేండ్లు గడ్సి మాజీ సర్పంచి అయ్యిండు. అయినా సర్పంచి అన్న పిలుపు మిగిలింది.

చారికి సర్పంచి పదవి పోయింది. షాపు పోయింది. అప్పు మిగిలింది. అప్పులోల్లకు సమాధానం చెప్పలేక చీకట్లె లేసిపోయి మంది పన్నెంక వొస్తుండు. ఊల్లె అప్పులోల్లు, నల్లగొండోల్లు ఇంటి సుట్టూ తిరిగిపోతుంద్రు.

'ఏం పీకితందుకు పోతుండమ్మా తెల్లారగట్ల లేసి? ఎన్నాల్లు తప్పించుకుంటడు?' అప్పులోల్లు చారి భార్యను పట్టుకొని దులుపుతుంద్రు.

అయినా చారికి అప్పులోల్ల ఎదురుబడి సమాధానం చెప్పడానికి ధైర్యం లేదు.

వో రోజు నల్లగొండ ఫైనాన్సోల్లు అద్దమ్మ రాత్రి వొచ్చి తలుపుకొట్టింద్రు.

'ఎన్నాల్లు తప్పించుకుంటవురా, శాతగానోనివి ఎందుకు తీసుకున్నవ్‌రా? ఊకె కరెంటు పని చేసుకొని బతికే దానికి రాజకీయాలని పోయి మమ్ముల ముంచుతావుర సర్పంచి లంజాకొడక? అని గల్ల పట్టి గుంజింద్రు.

చారి గడగడ వొనికి ఏదో చెప్పబోయిండు. పెండ్లాన్ని సర్పంచని బెట్టి అయిదేండ్లు ఆడినవ్? అప్పుకొచ్చాడ పెండ్లాన్ని అడ్డుపెట్టి తీర్సాల్రా సిగ్గున్న నా కొడుకువైతే' అని ఆగం ఆగం చేసింద్రు.

సర్పంచి చారికి దిగజెమటలు పట్టినయ్. యిజ్జతు పోయింది. చేసుకునే పని బోయింది. ఎట్ల తీర్చాలె అని తల బట్టుకుండు.

అప్పులోల్ల వీరంగానికి తట్టుకోలేక ' ఆగురి రొండు రోజులల్ల తీర్చుత' అని పబ్బతి పట్టిండు.

'రొండు రోజులల్ల యియ్యకుంటె నా కొడకా....' అని యెల్లిపోయింద్రు అప్పులోల్లు.

అర్ధరాత్రి గందరగోళానికి దిగ్గున లేసి బిత్తర పోయి చూస్తున్న యిద్దరు బిడ్డల అల్లుకుంది చారి భార్య. గుండెలవిసిపోతుంటే ఏడ్సి ఏడ్సి..... అల్సి పోయి తల్లీ బిడ్డలు పండుకుంద్రు.

తెల్లవారుజామున ఉలిక్కిపడి లేసి కూసుండు చారి.

అప్పులోల్ల బాకీ తీర్సాల్నా? తన బాకీ తీర్సుకోవాల్నా?... ఆలోచించుకుంట పైన దూలం కల్ల సూస్తుండు.

భర్త పరిస్థితిని అర్థం చేసుకున్న చారి భార్య దిగ్గున లేసి మొగనిమీద చెయ్యేసింది. 'ఎందుకిద యితవ్? ఈడ గాకుంటె ఇంకోకాడ బతకొచ్చు. దేశం గొడ్డుబోయిందా?' అన్నది.

భార్య దిక్కు సూస్తున్న చారికి పక్కన ఆదమర్సి నిద్రపోతున్న పిల్లలు కనిపించింద్రు.

ఏదో తోవ కనిపించినట్లయ్ తేరుకుండు. లేసి తలుపు తీసిండు. ఆకాశంలో మినుకు మినుకు మంటున్నయ్.

కపర కపర చీకట్ల గల్లు గల్లుమని కర్ర పొడుసుకుంట వొస్తుండు మస్తాను. చారిని సూసి 'ఈ సారికి అరిజండ్ల కు రిజర్వేషనయ్యిందంట. దొర రేకలు బారంగనే లేసి గడీల కూసుండు. మాదిగ ఎంకులు కొడుకు కోల్ల నర్సిమ్మను పిల్సకరమ్మన్నడు' అనుకుంట యెల్లి పోయిండు.

